క్లుప్తంగా

నేడు గద్వాలకు ఎంపీ డీకే అరుణ రాక

గద్వాల: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ మంగళవారం గద్వాలకు వస్తున్నారని, విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఎంపీగా గెలిచాక మొదటిసారి ఆమె గద్వాలకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారిపై పట్టణ పుర వీధుల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రతి గ్రామం నుంచి బీజేపీ కార్యకర్తలు తరలివచ్చేలా దిశానిర్దేశం చేశారు. విజయోత్సవ ర్యాలీ అనంతరం ఎస్‌వీ ఈవెంట్ హాల్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని ఘనంగా సన్మానించనున్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



గద్వాల రూరల్: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఎమ్మెల్యే వర్గీయులు అభినందనలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన వీ రాజుకు మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.10లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, రాజేశ్, తిమ్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టాండ్ వితరణ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లికి చెందిన దౌలత్ రెండు ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం దౌలత్‌కు వాకింగ్ స్టాండ్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, సభ్యులు వినయ్, రాజు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ



అయిజ: మున్సిపాలిటీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్లు పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేస్తూ అన్ని కుల ఉద్యమాలకు సంఘీభావం ప్రకటిస్తూ తన జాతి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులు రాజేష్, మారెప్ప, విజయభాస్కర్ రెడ్డి, సుధాకర్‌గౌడ్, ముక్కెరన్న, ఇమ్మానియేల్, రాజు, జమ్మన్న, విజయ్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన తెలుగు దేగ రాముడు, యాక్తాపురానికి చెందిన హరిజన రాముడు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీచుపల్లి, కృష్ణయ్య, లక్ష్మన్న, బలరాముడు, ఎల్లప్ప, లింగరాజు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను తొలగించండి

మానవపాడు: పారిశుద్ధ్య కార్మికులను తొలగించాలని పెద్దపోతులపాడు గ్రామంలో కొందరు వ్యక్తులు సోమవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ప్రత్యేక అధికారి రాఘవేంద్ర, కార్యదర్శి ఫయాజ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభ నిర్వహించే క్రమంలో కోరం లేక గ్రామసభను మంగళవారానికి వాయిదా వేశారు. గ్రామంలో 5మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారని, ఇద్దరిని తొలగించాలని గ్రామంలోని ఒకవర్గం డిమాండ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం నిర్వహించే గ్రామసభలో గ్రామంలోని మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

ధరూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండలంలో కాంగ్రెస్ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు వైఎస్సార్ ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్నారన్నారు. ఆనాడు దివంగత మహానేత నెట్టెంపాడు జలాలతో మండలాన్ని సస్యశ్యామలం చేశారని, రైతు బాంధవుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో జాంపల్లి మాజీ సర్పంచ్ గణపతి, మాజీ ఎంపీటీసీ దౌలన్న, మాజీ కో ఆప్షన్ మెంబర్ దర్శెల్లి, నాయకులు సీతారాములు, ఈదన్న, కారం రవి, నౌషద్, ఎర్రన్న, కర్రెన్న, సైదన్న, రాములు, ఉచ్చ బుడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు



గట్టులో వైఎస్సార్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



అయిజలో నివాళులర్పిస్తున్న అభిమానులు

అయిజ: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రంలో వైఎస్సార్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు ఎండీ నజీర్, దేవరాజు, ఈరన్న, బాబు, సురేష్, ముస్తఫా, నరసింహులు, ఈదన్న పాల్గొన్నారు.

గట్టు: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచి పోయినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహబూబ్‌పాష, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌస్, ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న, చాగదోణ మాజీ ఎంపీటీసీ బుడ్డప్ప, నాయకులు గద్దగుండు గోవిందు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.నర్మద డిమాండ్ చేశారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ, లింగన్‌వాయి సబ్ సెంటర్లను సోమవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ పీహెచ్‌సీలో రోజు వారీగా ఓపీలు 100 నుంచి 120 దాకా వస్తున్నాయని, కాన్పులు ప్రతినెల 30 నుంచి 45 వరకు అవుతున్నాయని తెలిపారు. ఆరు పడకలు సరిపోవడం లేదని, అదనంగా పెంచాలన్నారు. న్యూట్రీషన్ కిట్స్ కూడా ఇవ్వడం లేదని, స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎంల ఖాళీలు భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయికలు జీకే సుజాత, గమ్మడం రాణి, లక్ష్మీదేవి ఉన్నారు.



క్యాతూర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



అలంపూర్: నియోజకవర్గానికి చెందిన పలువురిని ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. అయిజ మున్సిపాలిటీకి చెందిన ప్రసాద్ కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కాలుకి ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు సోమవారం వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన రవీందర్‌రెడ్డి తల్లి పుష్పావతమ్మను ఎమ్మెల్యే పరామర్శించినట్లు తెలిపారు. అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వీరితోపాటు కిషోర్, రఘురెడ్డి, రవిరెడ్డి, ఆనంద్ ఉన్నారు.

ఏఎంసీ చెకప్ నిరంతరంగా ఉండాలి



మానవపాడులో మాట్లాడుతున్న డాక్టర్ రిజ్వానా తాన్విర్

మానవపాడు: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో ఏఎంసీ చెకప్ నిరంతరంగా ఉండాలని డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. సోమవారం మండలంలోని బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల్లో ఏఎంసీ చెకప్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల్లో 21మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామన్నారు. వీరందరికి రక్త పరీక్షల కోసం రక్త నమూనాలను శాంపుల్ సేకరించి అన్ని రకాలైన పరీక్షల కోసం టీ-హబ్ వాహనం ద్వారా గద్వాలకు పంపిచామన్నారు. ఆరోగ్య సలహాలు, సూచనలు అందించామన్నారు. న్యూట్రీషన్ గురించి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్యారాణి, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంపుల సీజ్



రాజోళి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ సోమవారం చేశారు. రాజోళిలోని తుంగభద్ర నది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని సోమవారం సోషల్ మీడియా ద్వారా సమాచారం రావడంతో పోలీసులు ఇసుక డంపుల వివరాలను తహసీల్దార్ హరికృష్ణకు అందించారు. దీంతో ఆయన సిబ్బందిని పంపి ఇసుక డంపులను సీజ్ చేయించారు. అనంతరం అక్రమ ఇసుక డంపుల గురించి మైనింగ్ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అయిజ: మున్సిపాలిటీలో మురుగు పేరుకు పోయిందని, పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని వివిధ కాలనీల ప్రజలు అధికారులను కోరారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, అధికారులు కలిసి 18,19 వార్డులలో వివిధ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు వారి సమస్యలను ఏకరువుపెట్టారు. డ్రెయినేజీలు నిండిపోయి మురుగు రోడ్డుపై పారుతోందని, దాని వల్ల దుర్వాసన వస్తుందని, దోమల ఉధృతిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలని ఆయా కాలనీల ప్రజలు కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు నచ్చజెప్పడంతో ప్రజలు శాంతించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్లు విజయ్, పవన్, ప్రకాష్, వార్డ్ ఆఫీసర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



సమస్యలను అధికారులకు వివరిస్తున్న కాలనీ ప్రజలు

ఆదిశిలావాసుడికి భక్తుల వెండి వితరణ



మల్దకల్‌లో ఆలయ చైర్మన్‌కు వెండిని వితరణ చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి భక్తులు సోమవారం వెండిని వితరణ చేశారు. బెంగళూరుకు చెందిన రామన్ననాయక్, జయశ్రీ దంపతులు 100 గ్రాముల వెండిని స్వామి వారికి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు దాతలకు పూలమాల, శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలికలో ప్రజాపాలన సేవ కేంద్రం

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని పురపాలిక కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులను సరి చేసేందుకు సోమవారం వార్డు అధికారులు స్వీకరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరు గ్యారంటీ అమలులో భాగంగా కొంత మంది దరఖాస్తులు తప్పులు పెట్టుకున్న వారిని తీసుకోని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల వారికి గ్యాస్, గృహజ్యోతి, ఉచిత విద్యుత్, మహాలక్ష్మీ పథకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

సీసీరోడ్లు నిర్మించండి



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని పట్టణంలోని వివిధ కాలనీల ప్రజలు సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్నకు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా మాధవ థియేటర్ నుంచి భద్రయ్య కాంప్లెక్స్ వరకు రోడ్డు, డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారిందని, వర్షాకాలం మనుషులు నడవలేని పరిస్థితులు ఏర్పడుతుందని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



ఉండవెల్లి: ప్రాగటూరు నుంచి కర్నూల్ జనరల్ ఆస్పత్రికి గర్భిణిని తీసుకెళ్తున్న క్రమంలో తక్కశిల శివారులో 108లోనే మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని ప్రాగటూరు గ్రామానికి చెందిన పార్వతి, రమేష్‌లు దంపతులు. పురుటి నొప్పులు రావడంతో రెండో కాన్పు కోసం 108లో తీసుకెళ్తున్న క్రమంలో ప్రసవమైంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ ఈఎమ్‌టీ రాధామోహన్, పైలెట్ శ్రీశైలం, ఆయా శారద తెలిపారు. అనంతరం వారిని కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎర్రవల్లిచౌరస్తా: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయతీలో నీలి జెండా ఎగురవేసే విధంగా పల్లెల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలను సన్నద్ధం చేయాలన్నారు. దీని కోసం ముందస్తుగా ప్రజలకు అంబేడ్కర్, పూలే, సిద్ధాంతాలతో పాటు బీఎస్పీ సిద్ధాంతాలను బోధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, సుంకన్న, సవరన్న, నరేష్, మోహన్‌రాజ్, రాముడు, తదితరులు ఉన్నారు.



విద్యుదాఘాతంతో గేదె మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన గద్వాల మండంలోని శెట్టిఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. రైతు వివరాల మేరకు.. బీసన్నకు చెందిన గేదె ఆదివారం సాయంత్రం గ్రామ శివారుల్లోని వ్యవసాయ పొలంలో మేత కోసం వెళ్లింది. ఈ క్రమంలో పొలంలో విద్యుత్ స్తంభం ఎర్తు తీగలు గేదెకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె మృతితో నష్టం ఏర్పడిందని పేర్కొన్నాడు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివున్ని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ధరూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద సీఐటీయూ, హమాలీ సంఘం నాయకులతో కలిసి ఈనెల10న జరిగే కార్మికుల కోరికల దినాన్ని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై కార్మికులు సంఘటితం కావాలన్నారు. ఈకోడ్‌ల వల్ల కార్మికుల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. వెట్టిచాకిరి, కట్టు బానిసత్వం, శ్రమ దోపిడీకి గురి చేసే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ కూడా అనుసరిస్తోందన్నారు. తక్షణమే కార్మిక సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేకల నర్సింహులు, దేవదాసు, ప్రవీణ్, తిమ్మప్ప, నాగరాజు, వెంకట్రాములు, వినయ్, లింగన్న, సైదన్న, తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నర్సింహ

ప్రభుత్వం కాలయాపన చేస్తోంది



కేటీదొడ్డిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ షాహిదాబేగానికి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన రూ.2 లక్షల రుణాన్ని బేషరతుగా మాఫీ చేయాలని, ప్రతి ఎకరాకు రైతు భరోసా ఖరీఫ్, రబీ కలిపి రూ.15 వేలు అందించాలని, కౌలు రైతులకు రూ.15 వేలు ఆర్థిక సాయం, వ్యవసాయ రైతులకు సంవత్సరానికి 12 వేలు, తెలంగాణ ప్రధానమంత్రి పంటల బీమా యోజనను వెంటనే అమలు చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి, వీరన్న, తదితరులు ఉన్నారు.

పంటసాగు నమోదు చేసుకోవాలి

మానవపాడు: వానాకాలం సీజన్ 2024కు సంబంధించి పంటలు సాగు చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో క్షేత్రస్థాయిలో పక్కాగా నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాలలో రైతులు వేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. పంటపొలాల్లో ఆన్‌లైన్ చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులకు సహకరించాలని సూచించారు. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఏఏ పంటలు వేశారు, ఏసర్వే నెంబర్ ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారనే విషయాన్ని వ్యవసాయ అధికారులు తెలుసుకుని ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు దశరథరామయ్య, రైతులు పాల్గొన్నారు.



పెద్దఆముదాలపాడులో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి

సెల్‌ఫోన్ టవర్ పనులు ఆపాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో ఓ నెట్‌వర్క్‌కు సంబంధించిన సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు పనులను వెంటనే నిలిపేయాలని కాలనీవాసులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య, అంగన్‌వాడీ సెంటర్, దేవాలయం సమీపంలో సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం వల్ల అనేక ఆరోగ్య సమస్యలతో పాటు రేడియేషన్ ప్రభావంతో తీవ్ర దుష్ప్రభావాలు సంభవించే అవకాశం ఉందన్నారు. వెంటనే సెల్‌ఫోన్ టవర్ అనుమతిని రద్దు చేసి, కాలనీవాసుల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగి సుదర్శన్, ఇలియాస్, సునీత, కురుమన్న, క్రిష్ణ, కాలనీవాసులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల తొలగింపును ఆపాలి

మానవపాడు: గ్రామపంచాయతీ కార్మికుల అక్రమ తొలగింపులను ఆపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతినెల మొదటి వారంలో ఇస్తున్న ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మేజరు గ్రామ పంచాయతీ కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జులకల్ మధు, రాముడు, పెద్దలాలు, రాములమ్మ, పుణ్యావతి, ఆశమ్మ, వెంకటరాముడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్

ఆర్టీసీకి షాపుల అద్దె చెల్లించాలి

మానవపాడు: ఆర్టీసీ స్థలంలో షాపులున్న వారు అద్దెలు చెల్లించాలని, లేదంటే తొలగిస్తామని మహబూబ్‌నగర్ డిప్యూటీ ఆర్‌ఎం ధర్మ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నషాపులకు నెలకు రూ.800, పెద్ద షాపులకు రూ. 1200 అద్దెను, ఐదేళ్ల అగ్రిమెంట్ కోసం డీడీ రూపంలో టీఎస్‌ఆర్టీసీ మహబూబ్ నగర్ రీజియన్‌కి డీడీ తీయాలన్నారు. 24 షాపులు ఉంటే, 8 మంది డీడీలు కట్టారని, 16 మంది డీడీలు అగ్రిమెంట్ కోసం చెల్లించాలన్నారు. ఇప్పటికే కొన్ని షాపులకు అనుమతి ఉందన్నారు. అనుమతి లేని షాపుల వారు అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గద్వాల డీఎం మంజుల, వెంకటస్వామి, ప్రసాద్, కుర్మయ్య పాల్గొన్నారు.



అద్దె షాపుల వివరాలు తెలుసుకుంటున్న మహబూబ్‌నగర్ డిప్యూటీ ఆర్‌ఎం ధర్మ

అయిజలో వసతిగృహం ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

గద్వాల రూరల్: అయిజలో విద్యార్థులకు నివాసముండేందుకు ప్రభుత్వం వసతిగృహం ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అయిజ పట్టణంలో బీఈడీ, డిగ్రీ, ఇంటర్మీడియట్ కాలేజీలు ఉన్నాయని, ఇందులో సుమారు 2వేల మంది విద్యార్థులకు చదువుతున్నారన్నారు. వారికి సరైన వసతిగృహం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వారి ఇబ్బందులు తొలగించేలా ప్రభుత్వం వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, రజక నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి ఘన సన్మానం

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలలో పన్నెండేళ్ల పాటు పనిచేసి బదిలీపై వెళ్తున్న కొంకల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మను విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. క్రమశిక్షణ, మెరుగైన విద్యను అందించి, రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలకు విద్యార్థులు ఎంపికయ్యే విధంగా ప్రత్యేక తరగతులు బోధించిన ఆమె అందరికి ఆదర్శమని పలువురు కొనియాడారు. నటి మంచులక్ష్మి ఆధ్వర్యంలో నడుస్తున్న టీచ్ ఫర్ చేంజ్ కింద పాఠశాలను చేర్పించి డిజిటల్ క్లాస్ రూంను మంజూరు చేయించుకుని విద్యార్థులకు డిజిటల్ తరగతులు నేర్పిన ఘనత వెంకటనర్సమ్మకే దక్కుతుందన్నారు. బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయురాలిని చూసి విద్యార్థులు కంటతడిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయురాలు వెంకటనర్సమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు